పక్కన చేరి.. పక్కాగా కాజేసి

ప్రభుత్వ భూములపై కబ్జాకోరులు డేగల్లా వాలిపోతున్నారు. ముందుగా ఆ పక్కనే కొంత స్థలం కొనుగోలు చేసి క్రమంగా ప్రభుత్వ భూమి ఆక్రమణ చేస్తున్నారు. అధికారుల ఉదాసీనత, నిర్లక్ష్యం ఆక్రమణదారులకు వరంగా మారిందనే ఆరోపణలున్నాయి. ఈ తతంగమంతా మండల కేంద్రాల సమీపంలోనే జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

- న్యూస్‌టుడే, కల్వకుర్తి

నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల కేంద్రంలోని రాచాలపల్లి వెళ్లే దారి సమీపంలో ఉన్న సర్వే నంబరు 323లో 14.13 ఎకరాల భూమిని గుర్తించారు. రూ.30 లక్షలతో ఒకే చోట ప్రకృతి వనం, వర్మికంపోస్టు ఎరువుల తయారీ కేంద్రం, డంపింగ్ యార్డు, వైకుంఠధామం ఏర్పాటు చేశారు. ఉపాధి పథకం ద్వారా 12 ఎకరాల్లో మొక్కలు నాటారు. ఇటీవల ఇదే సర్వే నంబరు 323ను ఆనుకొని ఉన్న భూమిని హైదరాబాద్‌కు చెందిన ఓ రియల్టరు ఎకరా రూ.60 లక్షల చొప్పున కొనుగోలు చేశారు. పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిపై కన్నేశారు. కొనుగోలు చేసిన భూమిని చదును చేసే క్రమంలో సమీపంలోని ప్రభుత్వ భూమిని సైతం ఆక్రమించారు. వర్మి కంపోస్టు ఎరువుల తయారు కేంద్రం పక్కనే దర్జాగా బాత్‌రూం ఏర్పాటుకు గోడలు పెట్టారు. అంతటితో ఆగకుండా ప్రకృతి వనంలో కొన్ని మొక్కలను తొలగించి కొనుగోలు చేసిన భూమిలోకి దారిని ఏర్పాటు చేసుకున్నారు. సుమారు అర ఎకరాకు పైగా భూమి ఆక్రమణకు గురైంది. నిత్యం పంచాయతీ సిబ్బంది ఆక్రమణకు గురైన చోటుకు చెత్తను డంపింగ్‌యార్డులో పోయటానికి వెళ్తున్నా.. మొక్కలను తొలగించి దారిని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తించకపోవడం గమనార్హం.



ఊర్కొండలో వర్మికంపోస్టు ఎరవుల తయారీ కేంద్రం పక్కనే సిమెంట్ ఇటుకలతో చేస్తున్న అక్రమ నిర్మాణం



ఊర్కొండ : ప్రకృతి వనం నుంచి ఆక్రమంగా ఏర్పాటు చేసిన దారి

● ఊర్కొండ మండలం తిమ్మన్నపల్లి గ్రామంలోనూ ప్రకృతి వనాన్ని తొలగించి కొందరు అక్రమంగా దారిని ఏర్పాటు చేసుకున్నారు. ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని ప్రజలు ఆరోపించారు.

● వెల్దండ మండలం కుప్పగండ్ల గ్రామ పంచాయతీ పరిధిలో 1,860 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దానికి అనుసరించి ఉన్న భూమిని కొనుగోలు చేసిన కొందరు రియల్టర్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు ఆరోపణలున్నాయి. ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ● వెల్దండ మండలం అజిలాపూర్ గ్రామానికి చెందిన భూమిలేని పేద రైతులకు ప్రభుత్వం భూమి కేటాయించి పట్టాలు పంపిణీ చేసింది. కోర్టులో కేసులు ఉండటంతో రైతుల పేరిట పట్టా కాకుండా నిలిచి పోయింది. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు రైతులను మభ్యపెట్టి తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

సర్వే చేయించి చర్యలు చేపడుతాం..: సర్వే నంబరు 323లో ఉన్న ప్రకృతి వనాన్ని ఆక్రమించారని ఫిర్యాదులు వచ్చాయి. భూమిని సర్వే చేయించి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం. వర్మి కంపోస్టు ఎరువుల షెడ్డు పక్కన నిర్మించిన అక్రమ నిర్మాణం ఎక్కడ ఉందో నిర్ధారించి ప్రభుత్వ భూమిలో ఉంటే తొలగిస్తాం. మొక్కలు తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతాం.

- కృష్ణయ్య, ఎంపీడీవో, రాంకోటి, తహశీల్దారు, ఊర్కొండ

ఈనాడు నాగర్‌కర్నూల్

శనివారం అక్టోబరు 5, 2024

బ్రహ్మచారిణిగా జోగులాంబ



అలంపూర్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం రెండో రోజు జోగులాంబ అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల్లో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవీ నవరాత్రుల్లో శుక్రవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు రోజూ ఆలయంలో ఆర్జిత సేవలు నిర్వహిస్తున్నారు. ఉదయం సహస్రనామార్చన, కుంకుమార్చన, శ్రీచక్ర నవావరణ అర్చన, చండీహోమం, రాత్రి 7 గంటలకు కొలువు పూజలో భాగంగా సువాసిని, కుమారి పూజలను అర్చకులు నిర్వహించారు. అంతకు ముందు జోగులాంబ ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ రథంపై ప్రదక్షిణ నిర్వహించారు. ఈవో పురేందర్, అర్చకులు, ధర్మకర్తల సభ్యులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి రాయితీ



ఇప్పలపల్లిలో మొక్కలను పరిశీలిస్తున్న అదనపు డీఆర్‌డీవో రాజేశ్వరి

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : పండ్ల తోటల పెంపకానికి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అందిస్తున్న రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు డీఆర్‌డీవో రాజేశ్వరి సూచించారు. శుక్రవారం మండలంలోని ఇప్పలపల్లి దారిపక్కన నాటిన మొక్కలను పరిశీలించి మాట్లాడారు. అన్ని రకాల పండ్లతోటలకు చిన్న, సన్నకారు రైతులకు వందశాతం రాయితీ ఉంటుందన్నారు. ఉత్సాహం ఉన్న రైతులు ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడి తోటలు సాగు చేసుకోవాలన్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, ఏ ఒక్క మొక్క ఎండిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై ఉందన్నారు. మొక్కలచుట్టూ పాదులు చేయించాలని, పిచ్చిమొక్కలు, గడ్డిని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఉపాధి హామీ కార్యాలయంలోని దస్త్రాలను పరిశీలించారు. క్లస్టర్ టీఏ రాజేశ్, ఏపీవో సత్యం, ఇన్‌ఛార్జి ఎంపీడీవో రాములు, ఉపాధిహామీ సిబ్బంది బాల్‌రాజ్, తయ్యబ్ పాల్గొన్నారు.

'డిజిటల్ కార్డు' సర్వేపై అపోహలొద్దు



కంటోనిపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ కుటుంబకార్డు సర్వేపై అపోహలకు లోనుకావద్దని ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ కోరారు. శుక్రవారం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన వెల్దండ మండలం కంటోనిపల్లి గ్రామంలో ఇంటింటి డిజిటల్ సర్వే తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామం, మున్సిపాలిటీలోని ఒక వార్డులో ఈనెల 7 వరకు ఐదేసి బృందాలు వివరాలు నమోదు చేస్తారన్నారు. కుటుంబసభ్యుల వివరాలను ఇంటి పెద్ద చెప్పిన విధంగానే పొందుపర్చాలని, సొంత నిర్ణయాలు ఎంతమాత్రం తీసుకోవద్దని సిబ్బందికి సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని, సాంకేతిక సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. చిన్నారులు తడబాటు పడటంతో మరోసారి తనిఖీకి వచ్చేటప్పటికి అన్నీ నేర్పించాలని కార్యకర్త ఆలువేలును ఆదేశించారు. బియ్యం, గుడ్లు నాణ్యతగా లేకుంటే తిరిగి పంపించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనువాసులు, తహసీల్దార్ కార్తిక్‌కుమార్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఎంపీవో లక్ష్మణ్‌నాయక్, ఆర్ఐ శంకర్, గిరిగౌడ్, ఫయాజ్, మంజుల, మాజీ సర్పంచి పెద్దిరామకృష్ణ, నాయకులు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

తారు రోడ్డు మంజూరు చేయాలని వినతి..: మండల కేంద్రం నుంచి తమ గ్రామానికి తారు రహదారి మంజూరు చేయాలని కలెక్టర్ సంతోష్‌కు యువకులు రవి, లక్ష్మణ్‌స్వామి, శివప్రసాద్ వినతిపత్రం అందజేశారు. రహదారి అధ్వానంగా తయారైందని, తారు రహదారిని మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. భూసమస్య పరిష్కరించాలని రైతు దర్శన్, ప్రవీణ్ వినతిపత్రం అందజేశారు.

క్రీడలకు అత్యంత ప్రాధాన్యం

ఎస్‌జీఎఫ్ కుస్తీ పోటీల ప్రారంభంలో ఎమ్మెల్యే పర్ణికరెడ్డి


రెజ్లింగ్ పోటీలను లాంఛనంగా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ధన్వాడ, న్యూస్‌టుడే : తమది క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే ప్రభుత్వమని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి అన్నారు. శుక్రవారం ధన్వాడ అప్పాజీ మైదానంలో 68వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాలికల రెజ్లింగ్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కప్‌లోనూ రెజ్లింగ్‌కు అవకాశం కల్పించామన్నారు. ధన్వాడలో రెజ్లింగ్ హాలు నిర్మాణం కోసం రూ.11 లక్షలు కలెక్టరు కేటాయించారన్నారు. డీవైఎస్‌వో వెంకటేశ్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డాక్టర్ రియాజ్, ధన్వాడ విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, పేట మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సదాశివరెడ్డి, ఉపాధ్యక్షుడు హన్మంతు, డైరెక్టర్లు రాంచంద్రయ్య, రాగ్యానాయక్, లక్ష్మయ్యగౌడ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కుస్తీ ప్రారంభం

ధన్వాడ, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా ధన్వాడలోని అప్పాజీ మైదానంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) బాలికల రెజ్లింగ్(కుస్తీ) పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, నిజామాబాద్, వరంగల్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు 300 మంది పాల్గొన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన క్రీడాకారులు పోటీలకు దూరంగా ఉన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికరెడ్డి జాతీయ పతాక ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభం కాగా ఆదిలాబాద్ క్రీడాకారులు వందన సమర్పణ చేస్తూ ముందుకు కదిలారు. మహబూబ్‌నగర్ క్రీడాకారులతో ఈ కార్యక్రమం ముగిసింది. తదుపరి ఎమ్మెల్యే పోటీలను లాంఛనంగా మొదలెట్టారు. మధ్యాహ్నం పెద్ద వర్షం పడటంతో మైదానంలో పోటీల నిర్వహణకు అంతరాయం ఏర్పడింది.


హోరాహోరీగా హ్యాండ్‌బాల్ పోటీలు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా కొనసాగాయి. బాలికల విభాగంలో ఉమ్మడి జిల్లాల నుంచి పది జట్లు పోటీపడగా కరీంనగర్ - మహబూబ్‌నగర్ మొదటి సెమీ ఫైనల్, ఆదిలాబాద్ - వరంగల్ జట్లు ద్వితీయ సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. చివరికి కరీంనగర్, ఆదిలాబాద్ జట్లు ఫైనల్‌కు చేరాయి. బాలుర విభాగంలో మొదటి సెమీ ఫైనల్‌లో మహబూబ్‌నగర్ - వరంగల్ జట్లు తలపడగా మహబూబ్‌నగర్ జట్టు ఫైనల్‌కు చేరింది. రెండో సెమీఫైనల్‌లో కరీంనగర్ - హైదరాబాద్ మ్యాచ్ శనివారం మొదటి సెషన్‌లో ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజ్, నర్సిములు, శ్రీనివాస్, రఫత్ పాల్గొన్నారు.

విస్తీర్ణంలో దేశంలో రెండో అతి పెద్ద పులుల అభయారణ్యం నల్లమల. అరుదైన వన్యప్రాణులు, పక్షులు, వృక్షాలు, ఔషధ మొక్కలకు నెలవు. 2611 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని ఏటీఆర్‌లో ఎంతో జీవవైవిధ్యం కనిపిస్తుంది. కర్ణాటక సరిహద్దు కృష్ణా తీరం కూడా జీవ జాతులకు ఆలవాలమే. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు సందర్భంగా ఇక్కడి విశేషాలు తెలుసుకుందాం.

జీవుల ఆలవాలం.. నీలపాలి కలకాలం


ధన్వాడలో శుక్రవారం నిర్వహించిన వన్యప్రాణుల సంరక్షణ ర్యాలీ


మద్దిమడుగు రేంజ్‌లో కనిపించే అరుదైన చింకార


మూషిక జింకలు

న్యూస్‌టుడే- అమ్రాబాద్, కృష్ణ

ఉమ్మడి పాలమూరు జిల్లా అరుదైన వన్యప్రాణులకు ఆలవాలం. అందులోనూ నల్లమల ప్రత్యేకం. సుమారు 180 కిలోమీటర్ల సరిహద్దుగా ఉన్న కృష్ణానది వేసవిలో జంతుజాలం దప్పిక తీరుస్తూ కాపాడుతోంది. అటవీ అధికారుల చర్యల మూలంగా 10 లోపు ఉన్న పెద్ద పులుల సంఖ్య 38కి చేరుకుంది. క్రమేపీ ఇతర జంతువుల సంఖ్య పెరుగుతోంది. అంతరించి పోయే దశలో ఉన్న జంతుజాతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నల్లమలలో పెద్దపులులతో పాటు జింకలు, మనుబోతులు, దుప్పులు, చిరుతపులులు, అడవి పందులు, ఎలుగు బంట్లు, కొండగొర్రెలతో పాటు ఎన్నో జాతుల జంతువులు నివసిస్తున్నాయి.

ఏం చేస్తున్నారు?

ఒకప్పుడు నల్లమలలో విస్తారంగా ఉన్న మూషిక జింకలు వివిధ కారణాల వల్ల అంతరించి పోయాయి. వానిని పునరుద్ధరించేందుకు అధికారులు హైదరాబాద్‌లోని నెహ్రూ జంతు ప్రదర్శన శాల నుంచి తెప్పించి అభివృద్ధి పరుస్తున్నారు. ఇందులో భాగంగా మన్ననూరు రేంజ్‌లోని పిచ్చకుంట్లోని చెరువు ప్రాంతంలో ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేసి అందుకు అనువైన వాతావరణ పరిస్థితులు కల్పిస్తున్నారు. ఒక్కొక్క బ్యాచ్‌కు 6 ఆడ, 2 మగ మూషిక జింకల చొప్పున 17 బ్యాచులు హైదరాబాద్ నుంచి తెచ్చి నల్లమల వాతావరణానికి అలవాటయ్యే వరకు షెడ్లల్లో పెంచి నెల తర్వాత అడవిలో వదులుతున్నారు. క్రమేపీ వాటి సంఖ్య పెరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. అటవీప్రాంతం పొడుగునా ప్లాస్టిక్ నిషేధించారు.

చికారాలు ప్రత్యేకం

కృష్ణ జింకలను పోలి ఉండే చింకారాలు ఏటీఆర్‌కే ప్రత్యేకం. నల్లమలలోని మద్దిమడుగు రేంజ్‌తో పాటు కవ్వాల్ పెద్దపులుల అభయారణ్యంలో మాత్రమే ఇవి కనిపిస్తాయి. వంపులు తిరిగిన కొమ్ములు, బెదురు చూపులతో అత్యంత పిరికిగా ఉండే చింకారాల అభివృద్ధికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈప్రాంతంలో ఉండే పశువులు, గొర్రెల మందలు వాటి అభివృద్ధికి ఆటంకంగా మారాయి. అడవిలో లభించే మేతను పశువులు, గొర్రెలు తినిపోవటంతో ఇవి ఆహారం కోసం ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లే అవకాశం ఉంది. దీంతో ఈప్రాంతంలో పశువులు, గొర్రెల మందలను అధికారులు నియంత్రిస్తున్నారు. వేటగాళ్లపై ప్రత్యేక నిఘా ఉంచటంతోపాటు తాగునీటి వసతికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఆవాసాల్లోకి మొసళ్లు, జింకలు

గత 30 ఏళ్ల క్రితం వరకు జింకలు, మొసళ్లను వేళ్లపై లెక్కించేవారు. ఇప్పుడు వాటి సంతతి గణనీయంగా పెరిగింది. నీటి లభ్యతతో పాటు విరివిగా ఆహారం లభించడంతో సంతతి గణనీయంగా పెరిగింది. మొసళ్ల విషయానికి వస్తే మొసలి పిల్ల చాలా చిన్నదిగా ఉంటుంది. నదిలో నుంచి నీరు ఎత్తిపోసే క్రమంలో ఆయా మోటార్ల ద్వారా పంట కాలువలలోకి చేరి సమీపంలోని చెరువులలోకి చేరుతున్నాయి. మనిషి అత్యధికంగా కోడి మాంసం తింటూ ఉండటంతో వాటి వ్యర్థాలు స్థానిక చెరువులు, నీటి కుంటలలో పార వేస్తున్నారు. దీంతో మొసళ్లకు మంచి ఆహారం లభిస్తుండటంతో జనావాసాలలోకి చేరుతున్నాయి. ఒకప్పుడు కర్ణాటక సరిహద్దులో కనిపించే జింకలు ఇప్పుడు పూర్తిగా గ్రామాల శివార్లలోకి చొచ్చుకొచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ మధ్య ఊట్కూరు వచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఈ సమస్యపై రైతులు మొరపెట్టుకున్నారు. కృష్ణా మండలం ముడుమాల్ వద్ద జింకల సంరక్షణ కోసం 70 ఎకరాల స్థలం కేటాయించారు. రూ.2 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఆ తరువాత ఈ కేంద్రం ఏర్పాటు ముందుకు సాగలేదు. ప్రజలకు జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అటవీశాఖాధికారి నీలేష్ 'న్యూస్‌టుడే'తో అన్నారు.

నీటి కుక్కలు


కృష్ణానదిలోని నీటి కుక్కలు

నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల నుంచి నాగార్జునసాగర్ వరకు ఉన్న సుమారు 180 కిలో మీటర్ల పొడవైన కృష్ణానదితో పాటు లింగాల, తెలకపల్లి ప్రాంతాల్లో నీటి కుక్కలు కనిపిస్తాయి. చేపలు, ఎండ్రగిచ్చలు ఆహారంగా తీసుకునే నీటి కుక్కలు మత్స్యకారులు చేపల కోసం వేసే వలలో చిక్కుకుని మృతి చెందుతుంటాయి. ఈకారణంగా నానాటికి నీటికుక్కలు అంతరించి పోయే అవకాశం ఉంది. ఇవే కాకుండ పసుపు గొంతు బుల్‌బుల్ పిచ్చుక, స్పాట్ బెల్లీడ్ డేగ-గుడ్లగూబ, బ్లాక్ బాజా లాంటి అరుదైన పక్షి జాతులు నల్లమలలో ఉన్నాయి.


అండర్-19 క్రికెట్ ఫైనల్‌కు పాలమూరు జట్టు

సెమీస్‌లో ఖమ్మంపై 60 పరుగుల తేడాతో ఘన విజయం


సెమీస్‌లో నెగ్గి ఫైనల్‌కు చేరిన ఉమ్మడి జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ (క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 రాష్ట్రస్థాయి టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు ఫైనల్‌కు చేరింది. శుక్రవారం వరంగల్‌లోని మొగిలిచర్ల మైదానంలో నిర్వహించిన సెమీస్‌లో ఖమ్మం జట్టుపై 60 పరుగుల తేడాతో నెగ్గింది. జిల్లా జట్టు నుంచి అబ్దుల్ రాఫె 110 పరుగులతో ఆకట్టుకున్నాడు. మొదట బ్యాటింగ్‌కు దిగిన పాలమూరు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. జిల్లా జట్టు నుంచి అబ్దుల్ రాఫె 110 (146 బంతుల్లో 4×11, 6×2) సాయంతో శతకం బాదాడు. కె.సాహిల్ 45, నగేశ్ 25, షాదాబ్ అహ్మద్ 22 పరుగులు చేశారు. అనంతరం ఖమ్మం జట్టు 39.3 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌట్ అయింది. మహబూబ్‌నగర్ జట్టు నుంచి ముఖీత్ 4, బి.రాజు, శశాంక్, షాదాబ్, సాహిల్ ఒక్కో వికెట్ తీశారు. శనివారం ఫైనల్‌లో జిల్లా జట్టు కరీంనగర్‌తో తలపడనుంది. ఫైనల్‌కు చేరిన జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, శిక్షకుడు అబ్దుల్లా, సంఘం సభ్యులు అభినందించారు.

అర కోటితో అలంకారం.. ఆకట్టుకునే రూపం



కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. రూ.50 లక్షలు విలువజేసే నోట్లతో అమ్మవారిని అలంకరించారు. ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌శెట్టి, సభ్యులు పాల్గొన్నారు. వరదేల శమీవృక్షం వద్ద ఉన్న దుర్గామాతను గాయత్రి అవతారంలో అలంకరించారు.

అలంపూర్ ఆలయాల ఛైర్మన్‌గా నాగేశ్వర్‌రెడ్డి


ఆలయాల నూతన ధర్మకర్తల సభ్యులు, చిత్రంలో సంపత్‌కుమార్

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ ఆలయాల నూతన ధర్మకర్తల కమిటీ సభ్యులతో శుక్రవారం ఈవో పురేందర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆలయ ఛైర్మన్‌గా కొంకల నాగేశ్వర్‌రెడ్డి పేరును ప్రతిపాదించారు. అందరూ ఆమోదించడంతో ఏకగ్రీవంగా ఛైర్మన్‌గా ఆయన ఎన్నికయ్యారు. ఈవో ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు కమిటీ సభ్యులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. నూతనంగా ఎన్నికైన ఛైర్మన్‌కు మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మిఠాయి తినిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడిన వారికి పదవులు ఉంటాయన్నారు. ఆర్డీఎస్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరిత దంపతులు, టెలికం సలహా సంఘం సభ్యుడు ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో ఐక్యత, ఆరోగ్యం


ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న అంజయ్యయాదవ్. చిత్రంలో నవీన్‌కుమార్‌రెడ్డి, నరేందర్ తదితరులు

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: క్రీడల ద్వారా ఐకమత్యం, సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, అలాంటి ఆటలకు నిత్యం కొంత సమయం కేటాయించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. షాద్‌నగర్ మినీస్టేడియంలో భారాస నాయకుడు నందారం అశోక్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఎంచుకున్న క్రీడలో రాణించాలని క్రీడాకారులను కోరారు. ఈ టోర్నమెంట్ 15 రోజులపాటు జరుగుతుందని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 70 టీంలు ఇందులో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్మన్ నరేందర్, వైస్‌ఛైర్మన్ నటరాజ్, శ్రీనివాస్‌గౌడ్, సుధీర్, బచ్చుల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వసతుల కల్పనకు చర్యలు


దేవరకద్రలో గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : గ్రంథాలయాలకు వస్తున్న పాఠకులకు పోటీ పరీక్షల పుస్తకాలు, అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసకుంటామని గ్రంథాలయ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ డా.రియాజ్ అన్నారు. శుక్రవారం రాత్రి మహబూబ్‌నగర్ పట్టణం మెట్టుగడ్డలోని కేంద్ర గ్రంథాలయాన్ని, దేవరకద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. అక్కడున్న పాఠకులతో మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డా.రియాజ్ గ్రంథాలయంలో సమస్యలపై యువతను ఆరాతీయగా భవనాన్ని విస్తరించాలని, మరిన్ని కుర్చీలు, పోటీపరీక్షల కొత్త పుస్తకాలు, మాసపత్రికలను సమకూర్చాలని కోరారు. మహబూబ్‌నగర్, నారాయణపేట గ్రంథాలయాల కార్యదర్శులు మనోజ్‌కుమార్, సురేశ్‌బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యలో భారీ కుంభకోణం

- సభ్యులకు తెలియకుండానే వారి పేర్లపై రుణాలు
- లబోదిబోమంటున్న మహిళలు

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం : పాలమూరు పురపాలిక 17వ వార్డు కోయనగర్ శ్రీసాయి మహిళా సంఘాల సమాఖ్య (ఎస్‌ఎల్‌ఎఫ్ - స్లమ్ లెవల్ ఫెడరేషన్)లో భారీ కుంభకోణం వెలుగు చూసింది. మహిళా సంఘాల పొదుపు ఖాతాలు పర్యవేక్షించే ఓ ఆర్పీ సభ్యులుగా ఉన్న మహిళలకు తెలియకుండానే వారి పేర్ల మీద భారీ మొత్తంలో రుణాలు తీసుకుని అవకతవకలకు పాల్పడ్డారు. దీనిపై ఎస్ఎల్ఎఫ్ పరిధి పలు సంఘాల మహిళలు పురపాలిక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కూడా కలిసి ఫిర్యాదు చేశారు. ఆగ్రహించిన ఎమ్మెల్యే వెంటనే కోయనగర్ ఎస్ఎల్ఎఫ్‌పై విచారణ చేయించినా మెప్మా అధికారులకు సూచించారు. మెప్మా డీఎంసీ శివకుమార్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. కోయనగర్ ఎస్ఎల్ఎఫ్‌లో మహిళల పొదుపు సొమ్ముతో పాటు రుణాల పేరిట ఆర్పీ పెద్ద మొత్తంగా అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయని, ఎమ్మెల్యే, పుర కమిషనర్ ఆదేశాలతో ముగ్గురు సీవోలు, నలుగురు సీనియర్ ఆర్పీలతో కూడిన మూడు బృందాలను ఏర్పాటు చేసి శనివారం నుంచి కోయనగర్ ఎస్ఎల్ఎఫ్‌పై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. అవకతవకలు వాస్తవమేనని, ఇటీవల కొంత మంది మహిళలు ఆర్పీపై ఫిర్యాదు చేయడంతో నయానా భయానా రూ.6 లక్షల వరకు సొమ్ము రికవరీ చేయించానని వార్డు కౌన్సిలర్ జంగమ్మ 'న్యూస్‌టుడే'తో చెప్పారు. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో మిగతా సంఘాల వాళ్లు కూడా అక్రమాలు జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

బ్యాంకు అధికారులు ఏం చేసినట్లు?

కోయనగర్ ఎస్ఎల్ఎఫ్ పరిధిలో 32 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘంలో 10 నుంచి 15 వరకు మహిళలు సభ్యులుగా ఉన్నారు. సభ్యులు బ్యాంకు లింకేజీ కింద రుణాలు తీసుకోవాలంటే వారి పేర్లతో ఆర్పీ సూక్ష్మ రుణ ప్రణాళిక (ఎంసీపీ - మైక్రో క్రెడిట్ ప్లాన్) తయారు చేసి ఒక్కో సభ్యురాలి సంతకం తీసుకోవాల్సి ఉంటుంది. ఎంసీపీని బ్యాంకులో సమర్పించాక క్షేత్రాధికారి (ఫీల్డ్ ఆఫీసర్) పరిశీలించి ఆయా మహిళలతో మాట్లాడి మరోమారు వారి సంతకాలు తీసుకుని వారి ఖాతాల్లోనే రుణ మొత్తం జమ చేయాలి. ఇందుకు భిన్నంగా జిల్లా కేంద్రంలోని ఓ బ్యాంకుకు చెందిన క్షేత్రాధికారి ఆర్పీ చెప్పినట్లు విని మహిళల సంతకాలు తీసుకోకుండానే ఒక్కో మహిళ పేరు మీద రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు మంజూరు చేసి నిధులు పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. ఇలా 32 సంఘాల్లోని చాలా మంది సభ్యుల పేర్ల మీద వారికి తెలియకుండానే ఆర్పీ పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్నట్లు మహిళలు ఆందోళనకు గురవుతున్నారు. శనివారం నిర్వహించే విచారణకు అన్ని సంఘాల సభ్యులు బ్యాంకు ఖాతా పుస్తకాలు, ఇతర దస్త్రాలతో హాజరు కావాలని సూచించామని, విచారణలో అవకతవకలు పూర్తిస్థాయిలో బహిర్గతం అయ్యే అవకాశం ఉంటుందని మెప్మా డీఎంసీ పేర్కొన్నారు.

నకిలీ మావోయిస్టును పట్టించిన సాంకేతికత


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గిరిధర్‌రావు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : నక్సలైట్‌నని ఓ రైస్‌మిల్లు వ్యాపారిని బెదిరించి ఫోన్‌పే ద్వార డబ్బు తీసుకున్న ఓవ్యక్తిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శుక్రవారం వనపర్తి కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి సుదర్శన్‌రెడ్డి అలియాస్ ప్రమోద్‌రెడ్డి ఇటీవల వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం సోలీపూర్ గ్రామానికి చెందిన మిల్లు యజమాని శేఖర్‌రెడ్డికి ఫోన్ చేసి తాను మాజీ నక్సలైట్‌నని. . రైస్‌మిల్లు అసోసియేషన్ నుంచి రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండు చేశారు. డబ్బులివ్వకుంటే చంపుతానని బెదిరించారు. ఈ నెల రెండో తేదీన హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లోని కమిషన్ బేస్డ్ వ్యక్తికి చెందిన ఫోన్‌పే నంబరుకు రూ.8 వేలు జమ చేయాలని శేఖర్‌రెడ్డికి చెప్పారు. బాధితుడు రూ.8 వేలు పంపించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఖిల్లాగణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితుడు డబ్బు తీసుకునేందుకు కమిషన్ బేస్డ్ వ్యక్తి ఇంటి వద్దకు రాగా కొత్తకోట సీఐ రాంబాబు, ఖిల్లాగణపురం ఎస్సై సురేశ్‌గౌడ్ పట్టుకున్నారు. అతన్ని విచారించగా నేరం ఒప్పుకొన్నాడు. నిందితుడు పెద్దపల్లిలో సుల్తానాబాద్, కరీంనగర్, సుబేదారి, మిర్యాలగూడ ప్రాంతాల్లో కొందరిని బెదిరించి డబ్బు తీసుకోవడంతో కేసులు నమోదయ్యాయి. కేసును త్వరగా ఛేదించిన కొత్తకోట సీఐ, ఖిల్లాగణపురం ఎస్సై, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వీరికి రివార్డు ఇస్తామన్నారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐతో పాటు వనపర్తి సీఐ నాగభూషణంరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

అయిజ, న్యూస్‌టుడే: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారికి సహకరిస్తున్న అయిజ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.కృష్ణయ్యను సస్పెండ్ చేస్తూ ఎస్పీ టి.శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు చేశారు. బాధ్యతారాహిత్యం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం కారణంగా శాఖాపరమైన చర్యలు చేపట్టారు. రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్న వారికి సహకరిస్తున్నాడని వచ్చిన ఆరోపణలపై విచారణ చేసిన అనంతరం రుజువుకావడంతో సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని ఎస్పీ కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటనలో తెలిపారు.

ఒకే రోజు ముగ్గురిపై శునకాల దాడి


గాయాలపాలైన రేవంత్

మానవపాడు, న్యూస్‌టుడే: ఒకే రోజు ముగ్గురు వ్యక్తులపై శునకాలు దాడిచేశాయి. అమరవాయి గ్రామానికి చెందిన పరశురాముడు కుమారుడు రేవంత్ శుక్రవారం ఉదయం పాల ప్యాకెట్ తీసుకురావడానికి ఇంటి నుంచి దుకాణానికి బయలు దేరాడు. వెళ్తున్న క్రమంలో రేవంత్‌పై కుక్కల గుంపు దాడికి పాల్పడింది. బాలుడు గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు, కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని శునకాలను చెదరగొట్టారు. అప్పటికే బాలుడిని కుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. ప్రాథమిక చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు రేవంత్‌ను కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన రామదాసు కుమారుడు శివపైనా కూడా కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. పెద్దఆముదాలపాడు గ్రామానికి చెందిన రామకృష్ణ వ్యక్తిగత పనుల నిమిత్తం వస్తుండగా అమరవాయిలో శునకాలు దాడి చేసి గాయపరిచాయి. వీరిద్దరూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. గ్రామాల్లో శునకాల స్వైరవిహారాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

పండగ పూట పస్తులేనా?

వేతనాలు అందక ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికుల అవస్థలు

కందనూలు, న్యూస్‌టుడే : జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద పారిశుద్ధ్య సిబ్బందికి సకాలంలో వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనెల 12న దసరా పండగ ఉందని, వేతనాలు అందక కొత్త దుస్తులు, సరకులు కొనుగోలు చేసుకోలేక పస్తులు ఉండాల్సి వస్తుందని వాపోతున్నారు.



నాగర్‌కర్నూల్ : వేతనాల కోసం ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

● నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రిలో 33 మంది ఉండగా ఒక్కో కార్మికునికి మూడు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది. జులై నుంచి సెప్టెంబర్ వరకు కలిపి మొత్తం రూ. 15.44 లక్షలు వేతన బకాయిలున్నాయి. పారిశుద్ధ్య కార్మికులు ఇటీవల ఆసుపత్రి వద్ద ధర్నా చేశారు. కొల్లాపూర్ సివిల్ ఆసుపత్రిలో 12 మంది ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తుండగా ఒక కార్మికుని బ్యాంకు ఖాతా సరిగా లేకపోవడం వలన మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు.

ఆసుపత్రి	పడకలు	పారిశుద్ధ్య కార్మికులు	వేతన బకాయిలు రూ. లక్షల్లో
నాగర్‌కర్నూల్	330	33	15.44
కల్వకుర్తి	50	22	11.08
కొల్లాపూర్	30	12	(ఒకరికి) 0.39
అచ్చంపేట	100	34	8.97

● జిల్లా కేంద్రం నాగర్‌కర్నూల్‌లో జనరల్ ఆసుపత్రి 3 నెలలు, కొల్లాపూర్, కల్వకుర్తిలో సివిల్ ఆసుపత్రులు 3 నెలలు, అచ్చంపేటలో ఏరియా ఆసుపత్రిలో 2 నెలలు బకాయిలున్నాయి.

చేతులెత్తేసిన గుత్తేదారులు: అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో పారిశుద్ధ్య కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు సంబంధించిన గుత్తేదారులు భర్తీ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రతి మూడు, ఆరు నెలలకోసారి నిధులు విడుదలైనప్పుడు ఆసుపత్రి అధికారులు గుత్తేదారునికి చెల్లిస్తారు. కార్మికుల భర్తీ, సేవల నిర్వహణ చేస్తున్నందుకు గాను గుత్తేదార్లకు కమీషన్ చెల్లిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వాల నుంచి సకాలంలో నిధులు రాకపోయినా కార్మికులకు ఇబ్బందులు కల్గకుండా సొంతంగా వేతనాలు చెల్లించాలని నిబంధనలున్నా అమలు కావడం లేదు.

వారంలో చెల్లిస్తాం..: జనరల్ ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలల వేతనాలు చెల్లించాలి. గుత్తేదారునికి చెల్లించాలని ఆదేశాలు జారీ చేసిన అతడు పట్టించుకోవడం లేదు. ఈ వారంలో కార్మికులకు మొత్తం వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకుంటాం.
- డా. రఘు, జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకుడు






అచ్చంపేట: వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో గాయత్రీ అలంకరణలో అమ్మవారు..అచ్చంపేట: భ్రమరాంబ దేవాలయంలో గాయత్రీదేవిగా అమ్మవారు.. అచ్చంపేట:దుర్గామాతకు పూజలు చేస్తున్న రక్షిత మహిళా సొసైటీ ప్రతినిధులు.. కల్వకుర్తి: కన్యకాపరమేశ్వరీ ఆలయంలో రూ.20లక్షలతో ధనలక్ష్మి రూపంలో అమ్మవారు

జగన్మాతా.. పాహిమాం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భక్తులు అన్ని గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు కుంకుమార్చనలు చేశారు. మహిళలు సాయంత్రం పెద్ద ఎత్తున తరలి వచ్చి కోలాటాలు, బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు.
- న్యూస్‌టుడే, బృందం



అచ్చంపేట: కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు



నాగర్‌కర్నూల్ : వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో..





నాగర్‌కర్నూల్ : పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో అమ్మవారి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మహిళలు.. వెల్దండ : కుప్పగండ్లలో విద్యార్థులు, యువకుల పూజలు.. కల్వకుర్తి : గాంధీనగర్ కాలనీలోని దుర్గామాతకు పూజలు

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో..రవి : దేవర, రమణ : స్వాగ్
కల్వకుర్తిలో.. పార్థసారథి : దేవర, అశోక్ : స్వాగ్

కూరగాయల ధరలు (తేదీ : 04.10.24)కిలో..రూ.లలో



కందనూలు, న్యూస్‌టుడే : టమాటా 68, వంకాయ 45, బెండ 45, మిరప 50, కాకర 64, బీర 64, క్యాలిఫ్లవర్ 74, క్యాబేజీ 45, క్యారెట్ 64, దొండ 50, ఆలుగడ్డ 45, ఉల్లిగడ్డ 58, గోకర 64, దోస 40, ఆనంకాయ 16, చిక్కుడు 64, మునగకాయ 64, బీట్‌రూట్ 50, ఖీర, 40, బీన్స్ 90.

కళాశాలలో బతుకమ్మ సంబరాలు

కోడేరు, న్యూస్‌టుడే : కోడేరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు శుక్రవారం బతుకమ్మ వేడుక నిర్వహించారు. ఊరకుంటలో నిమజ్జనం చేశారు. ప్రిన్సిపాల్ పద్మావతమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.



కోడేరు: కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు, అధ్యాపకులు

గ్రంథాలయ ఛైర్మన్‌కు సత్కారం



జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేందర్‌ను సత్కరించిన న్యాయవాదులు

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగాపురం రాజేందర్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నియామకమవడంతో న్యాయవాదులు శుక్రవారం సత్కరించారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుధాకర్, భాస్కర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, వెంకట్‌శెట్టి, మల్లేష్, మస్తాన్, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

యక్షగాన కళాకారుడి ఆరాధన ఉత్సవం

తెలకపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని గౌరారంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు యక్షగాన కళాకారుడు గోరటి నరసింహ ఆరాధన ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తన తండ్రి నరసింహ ఆరాధన ఉత్సవంలో పాల్గొన్న ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న తనదైన శైలిలో పాటలు, నాటక రంగం పద్యాలు పాడి అలరించారు. కార్యక్రమంలో గురువు ఈశ్వరయ్య, నాటక కళాకారులు హన్మంత్‌రెడ్డి, కేశవాచారి, వెంటపతి, బాబు, భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పద్యం పాడుతున ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

పేదలకు మెరుగైన వైద్యమందించాలి

చారకొండ (వెల్దండ (గ్రామీణం), న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందడంలేదని రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. చారకొండ మండలం తుర్కలపల్లికి చెందిన మల్లమ్మ అనారోగ్యంతో మృతిచెందగా.. కుటుంబ సభ్యులకు రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో అందజేసి మాట్లాడారు. సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, రూపం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఆర్సీ అమలుకు పోరాటం

అచ్చంపేట, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయకపోతే త్వరలో పోరాటం చేస్తామని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రావు అన్నారు. శుక్రవారం అచ్చంపేటలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల డీఏలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. నేతలు హన్మంతరెడ్డి, మురళి, ఈశ్వర్, రమేశ్, సతీశ్, సుదర్శన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోండి

కోడేరు, ఉప్పునుంతల, పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో శ్రావణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కోడేరులో ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తు చేసుకున్న స్థలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆర్ఐ జమ్ములయ్య, పంచాయతీ కార్యదర్శి రవితేజ పాల్గొన్నారు. ● ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించుకోవడానికి ఈనెలాఖరు వరకు అవకాశం ఉందని ఉప్పునంతల మండల పంచాయతీ అధికారి నారాయణ తెలిపారు. ● పెద్దకొత్తపల్లిలో ఎంపీడీవో నాగేందర్, గ్రామ కార్యదర్శి నాగశేషు, ఎంపీఈవో వెంకట్, గిర్దావరి వెంకటేష్, నీటిపారుదల శాఖ ఏఈ సుబ్బరాజు వెంచర్లను పరిశీలించారు.

అచ్చంపేట గ్రామీణం: డిజిటల్ కార్డుల కోసం బ్రాహ్మణపల్లి గ్రామంలో ఎంపీడీవో మధుసూదన్‌గౌడ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం సర్వే చేశారు. శివకుమార్, నరేష్, ఆంజనేయులు, మక్తలాల్, తిరుపతి పాల్గొన్నారు.

ముగిసిన పోలీసు నైపుణ్యాల ప్రదర్శన



మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న నాగేందర్

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్‌లో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా పోలీస్ నైపుణ్యాల ప్రదర్శన కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ హాజరై పలు పోటీల్లో ప్రతిభ చాటిన పోలీసులకు బహుమతులను అందించారు. సాంకేతిక పరిజ్ఞానం, నేర పరిశోధన, క్రిమినల్ లా, రాతపరీక్ష, మౌఖిక పరీక్ష, వేలిముద్రలు, నేరం జరిగిన చోటు ఫొటోగ్రఫీ, వాహనాల తనిఖీ, నేరం జరిగిన గదుల పరిశీలన, జాగిలాలతో నేరశోధన తదితరాల్లో పోలీసులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. మహబూబ్‌నగర్ పోలీసులు ఎక్కువ విభాగాల్లో ప్రతిభ కనబరచడంతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ అవార్డు దక్కించుకున్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతమ్, వనపర్తి ఎస్పీ గిరిధర్, జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, నాగర్‌కర్నూల్ అదనపు ఎస్పీ రామేశ్వర్, అదనపు ఎస్పీలు రాములు, సురేశ్ కుమార్, రామ్‌దాస్‌తేజ, రియాజ్ ఉల్ హక్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, వెంకటరమణారెడ్డి, సుదర్శన్, నర్సింహులు, నరేందర్‌రావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ప్రతిభ

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : పోలీసు శాఖ ఆధ్వర్యంలో కంప్యూటర్ పరిజ్ఞానంపై ఇటీవల నిర్వహించిన పరీక్షలో కానిస్టేబుల్ నాగేందర్ జోనల్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. మహబూబ్‌నగర్‌లో డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్ శుక్రవారం బంగారు పతకంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. నాగేందర్ బల్మూర్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్నారు.

బ్యాంకు సేవలపై కళాజాత

లింగాల, న్యూస్‌టుడే : బ్యాంకుల ద్వారా రుణాలు పొందడంపై రాయవరంలో నిర్వహించిన కళాజాత కార్యక్రమంలో అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతాలు, డిపాజిట్లు, రైతుల రుణాలను ఆటపాటలతో వివరించారు. మన్సూర్, శ్రీశైలం, నారాయణ, రూపేష్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం నిర్వహణ

వంగూరు, న్యూస్‌టుడే : మండలంలోని మిట్టసదగోడులో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది సుసన్న, జ్యోతి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం




అచ్చంపేట: కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు.. పాల్గొన్న భక్తులు

అచ్చంపేట, న్యూస్‌టుడే : స్థానిక కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం రాత్రి భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈనెల 8వ తేదీ వరకు ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు చంద్రశేఖర్, బాలరాజు, శ్రీనివాసులు, వినోద్ పాల్గొన్నారు.

11 యూనిట్లలో విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయం వద్ద వరద ఉద్ధృతి కొనసాగుతున్న నేపథ్యంలో విద్యుదుత్పత్తికి 35,815 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన ఐదు యూనిట్లు, దిగువన ఆరు యూనిట్ల ద్వారా ఉత్పత్తి జరుగుతోంది. గడిచిన 24 గంటల్లో ఎగువన 4.319, దిగువన 4.650 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలం ఎగువన 229.586, దిగువన 204.994 మిలియన్ యూనిట్లకు ఉత్పత్తి చేరుకుందని జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

అడవుల సంరక్షణే మనకు రక్షణ

అమ్రాబాద్, న్యూస్‌టుడే : అడవులను మనం కాపాడుతే అవి మనకు రక్షణగా నిలుస్తాయని అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యం ఎఫ్‌డీవో రామమూర్తి అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా మండలంలోని ఉప్పునుంతల, తిర్మలాపురం, మాధవానిపల్లి, లక్ష్మాపురం గ్రామాల్లో శుక్రవారం 'వన్యప్రాణులు, అడవుల రక్షణ మన బాధ్యత'పై అవగాహన కల్పించారు. మన్ననూరులో అటవీ సిబ్బంది, గ్రామస్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అడవులతో మానవులకు విడదీయరాని బంధం ఉందన్నారు. పెద్దపులి పశువులను చంపేస్తే నెలలోపే పరిహారం అందిస్తున్నామన్నారు. పంటలను అడవి పందులు ధ్వంసం చేస్తున్నాయని రైతులు వివరించగా.. విద్యుత్తు కంచె ఏర్పాటుకు దాతలు, ప్రభుత్వ సహకారానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌వోలు, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.



అమ్రాబాద్: మాధవానిపల్లిలో మాట్లాడుతున్న ఎఫ్‌డీవో రామమూర్తి

మత్స్యకారులకు నైపుణ్య శిక్షణ

కూసుమంచి, న్యూస్‌టుడే: పాలేరులోని మత్స్య పరిశోధన కేంద్రంలో నాగర్‌కర్నూల్ జిల్లా మత్స్యకారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా. శ్యాంప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో చేపల పెంపకానికి వనరులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో చేపల ఉత్పత్తిని రెట్టింపు చేయాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణను మత్స్య రైతులు సద్వినియోగపర్చుకుంటూ చేపల ఉత్పత్తికి తోడ్పడాలని సూచించారు. చేపల మేత తయారీ విధానంపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త రవీందర్ పలు అంశాలను వివరించారు.

ఖాళీ పోస్టులను గిరిజనులకు కేటాయించాలి

కందనూలు, న్యూస్‌టుడే : ఏజెన్సీ పరిధిలోని ఆశ్రమ పాఠశాల్లో ఒప్పంద పద్ధతిన భర్తీ చేస్తున్న సీఆర్‌టీ ఖాళీలను గిరిజనులకు కేటాయించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మనాయక్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని డీటీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామసభ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయాలన్నారు. హక్కులకు భంగం కల్గిస్తే పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దేశనాయక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బాలసదన్ సందర్శన



స్వీయ చిత్రం కేంద్రం వద్ద విద్యార్థులతో అదనపు కలెక్టర్ దేవ సహాయం

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని ముందుకెళ్లాలని బాలల సంరక్షణ ఛైర్మన్, జిల్లా అదనపు కలెక్టర్ దేవ సహాయం సూచించారు. పట్టణంలోని బాలసదన్‌ను శుక్రవారం సందర్శించి మధ్యాహ్న భోజనం చేసి, దస్త్రాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేసి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. పుర కమిషనర్ శ్యామ్‌సుందర్, శ్రీధర్, శ్రీశైలంగౌడ్, ప్రసన్న, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో ఎల్ఆర్ఎస్‌కు అనుమతి ఇవ్వద్దు

చారకొండ (వెల్దండ (గ్రామీణం), న్యూస్‌టుడే: చారకొండ మండలం శిర్సనగండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ భూముల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు ఎంతమాత్రం అనుమతులు ఇవ్వవద్దని ఆలయ ఈవో ఆంజనేయులు కోరారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై శుక్రవారం ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈసందర్భంగా సీతారామచంద్రస్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్ 327, 328 లోని భూముల్లో పలువురు దరఖాస్తు చేసుకోవడంతో ఈవో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆలయ భూములకు సంబంధించిన వివాదం కోర్టులో ఉందని, హైకోర్టు ఆలయానికి అనుకూలంగా తీర్పునిచ్చిందని, ఎల్ఆర్ఎస్‌కు అనుమతి ఇవ్వవద్దని ఆయన స్పష్టం చేశారు. ఇతర భూముల్లో ఎల్ఆర్ఎస్‌కు అనుమతిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. క్రమబద్ధీకరణ కోసం 30 దరఖాస్తులు రాగ వాటిన్నింటిని ఆర్ఐ భరత్‌గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేందర్‌రెడ్డితో కలిసి ఎంపీడీవో ఆరాతీశారు. అనుమతి లేని లేవుట్‌లు, ఇంటి నిర్మాణాలు, నివాస స్థలాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి చిత్రాలను తీసి యాప్‌లో నమోదు చేశారు. రెవెన్యూ అధికారులకు పంపించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. మేనేజర్ నిరంజన్ పాల్గొన్నారు.



ఆలయ భూములపై ఎంపీడీవోతో అభ్యంతరం వ్యక్తం చేస్తున్న ఈవో ఆంజనేయులు

నిరుద్యోగ భృతి అమలు చేయాలి

తాడూరు, న్యూస్‌టుడే : ఎన్నికల హామీ అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పించి ఆదుకోవాలంటూ దళిత సంఘం నాయకులు శుక్రవారం తహశీల్దార్ కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టుల భర్తీకి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. లక్షల్లో ఉన్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. నాయకులు చంద్రయ్య, మశన్న, లక్ష్మయ్య, పరశురాములు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

8న గోదాం ప్రారంభం

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : మండల కేంద్రంలో నిర్మించిన గోదాంను ఈనెల 8న ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరవుతారని చెప్పారు. శుక్రవారం గోదాంను పరిశీలించి మాట్లాడారు. వెంకట్‌రెడ్డి, ఖదీర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్లిన డీఈఈ

కల్వకుర్తి, న్యూస్‌టుడే: కల్వకుర్తి పంచాయతీరాజ్ శాఖ డీఈఈ దుర్గాప్రసాద్ కామారెడ్డి జిల్లా ఈఈగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. కల్వకుర్తిలో 15 ఏళ్లుగా విధులు నిర్వహించారు. అచ్చంపేట పంచాయతీరాజ్ డీఈఈ చంద్రకళ కల్వకుర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్‌కు చెందిన దుర్గాప్రసాద్ కల్వకుర్తి డివిజన్‌లో ఏఈగా విధుల్లో చేరారు. ఇక్కడే డీఈఈగానూ సేవలందించారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: కొట్ర శివారులో ఆటోను ఢీకొట్టి డ్రైవర్ ముంగలిశెట్టి శేఖర్, ఓరుగంటి కృష్ణయ్యను గాయపర్చిన తిమ్మినోనిపల్లి గ్రామానికి చెందిన కారు డ్రైవర్ ఎ.సత్యంపై కేసు నమోదైంది. గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంపై ఆటో డ్రైవర్ భార్య రేణుక శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు.

సోమశిలలో గంజాయి స్వాధీనం

కొల్లాపూర్, న్యూస్‌టుడే : సోమశిల గ్రామంలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఆబ్కారీ సీఐ నాగిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందంతో కలిసి దాడి నిర్వహించారు. సోమశిలలో రెడ్డిగారి మల్లయ్య వద్ద 20 గ్రాముల గంజాయి పట్టుబడింది. కేసు నమోదు, నిందితుడిని అరెస్టు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వర్లరెడ్డి, ఎస్సై హనుమంతు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినితో అసభ్యకర ప్రవర్తన

కందనూలు, న్యూస్‌టుడే : విద్యార్థినితో ఓ సిబ్బంది అసభ్యకరంగా ప్రవర్తించాడు. షీ టీం సిబ్బంది వెంకటయ్య కథనం ప్రకారం... పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ఒకరు మొదటి సంవత్సరం విద్యార్థినితో తరచూ అసభ్యకరంగా మాట్లాడుతూ వేధిస్తున్నాడు. విద్యార్థిని తల్లిదండ్రులు షీ టీంకు చెప్పడంతో వారు ఫిర్యాదు తీసుకున్నారు. ఇటీవలే విధుల్లో చేరిన ఆ వ్యక్తి కారణం లేకుండానే వేధిస్తున్నాడంటూ విద్యార్థినులు వాపోయారు. విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని షీ టీం సిబ్బంది చెప్పారు.

అసభ్య పోస్టులు పెట్టిన వ్యక్తికి దేహశుద్ధి

బిజినేపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని పాలెం గ్రామానికి చెందిన మాజీ మహిళా ప్రజాప్రతినిధిని అవమానించే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన వ్యక్తిపై గ్రామస్థులు దాడికి పాల్పడ్డారు. పాలెం గ్రామానికి చెందిన వ్యక్తి వాట్సాప్ గ్రూపుల్లో మహిళను కించపరిచేలా గురువారం రాత్రి పోస్టులు పెట్టడంతో, గ్రామానికి చెందిన పలువురు గుర్తించారు. అతడిని నిలదీసిన మహిళలు దాడికి పాల్పడ్డారు. సంఘటనపై ఫిర్యాదు అందలేదని ఏఎస్సై సయ్యద్ అలీ తెలిపారు.

అత్యాచార యత్నంపై ఫిర్యాదు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన ఓ మహిళ తనపై అత్యాచార యత్నం జరిగినట్లు ఠాణాలో ఫిర్యాదు చేసింది. వెల్గొండ గ్రామానికి చెందిన తిరుపతి కూలీ పనులకు వెళ్తుండగా బలవంతంగా సమీపంలోని నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించగా, తప్పించుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదుపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి ఎస్సై సయ్యద్ అలీ తెలిపారు.

మహిళను మోసం చేసిన యువకుడు

కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే : ఊరికి తీసుకువెళ్తానని మాయమాటలు చెప్పి ఓ మహిళను మోసం చేసిన ఘటన నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వికారాబాద్ జిల్లా దోమ మండలం గుండాల గ్రామానికి చెందిన చెన్నయ్య డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలానికి చెందిన ఓ మహిళ కోస్గి పట్టణానికి వ్యక్తిగత పనిపై వచ్చింది. పని పూర్తయ్యాక గురువారం రాత్రి బస్సు కోసం బస్టాండులో వేచి చూస్తోంది. ఈ క్రమంలో చెన్నయ్య ఆమెతో మాటలు కలిపారు. మీ ఊరికి ద్విచక్ర వాహనంపై దింపుతానని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన మహిళ వాహనంపై వెళ్లింది. ఆమెను పట్టణంలో వేరే ప్రాంతానికి తీసుకెళ్లి బెదిరించి లొంగదీసుకున్నాడు. ఆమె వద్ద రూ.5 వేలు లాగేసుకున్నాడు. రాత్రి అక్కడే వదిలేసి పారిపోయాడు. శుక్రవారం ఆమె పోలీసు ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు చెన్నయ్య పట్టుకుని విచారించారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

ఆరు కిలోమీటర్ల దారిలో అడుగుకో గుంత




తోటపల్లి-ఎలికట్ట గ్రామాల మధ్యలో చెరవు గట్టుపై పూర్తిగా శిథిలమైన బీటీ రోడ్డు.. మాదారం-ఎలికట్ట గ్రామాల మధ్య దారిపై గుంతలు

కల్వకుర్తి, న్యూస్‌టుడే : మొత్తం 11 కిలోమీటర్ల రహదారి మరమ్మతులకు రూ.83 లక్షలు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న గుత్తేదారు తుర్కలపల్లి నుంచి తోటపల్లి విద్యుత్ ఉపకేంద్రం వరకు 6 కిలో మీటర్ల రహదారిపై బీటీ వేశారు. మిగతా రహదారికి మరమ్మతులు చేపట్టకుండానే వదిలేశాడు. 10 నెలలు దాటినా గుత్తేదారు పనులు మొదలు పెట్టలేదు. కురుస్తున్న వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. 6 కిలోమీటర్ల రహదారి వెంట అన్నీ గుంతలే.. వర్షం వస్తే చాలు నీటితో నిండి చెరవులను తలపిస్తోంది. ఎలికట్ట, తోటపల్లి, మాధారం గ్రామాల ప్రజలు రహదారి వెంట రాకపోకలు సాగించటానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు గుత్తేదారు పై ఒత్తిడి తెచ్చి పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు. రహదారి దుస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి గుత్తేదారుతో పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తానని అచ్చంపేట డీఈఈ చంద్రకళ తెలిపారు.